సాక్షి
తిరుపతి
మంగళవారం । 9 । జూలై । 2024



అవినీతి లేదు గోవిందా!
తిరుమలలో గత ఐదేళ్లుగా ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని విజిలెన్స్ అధికారులు తేల్చిచెప్పారు. - 8లో



రక్షణ కల్పించండి
డ్యూటీలో ఉన్న రుయా ఆస్పత్రి నర్సులపై దాడులు జరగకుండా రక్షణ కల్పించాలని పలువురు డిమాండ్ చేశారు. - 8లో



తిరుమల శ్రీవారి సేవలో..
తిరుమల శ్రీవారిని సోమవారం కర్ణాటకలోని కుక్కే సుబ్రమణ్య మఠం పీఠాధిపతి దర్శించుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి ఐ అండ్ ఈ ప్రోగ్రాం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఐ అండ్ ఈ) ట్రైనింగ్ ప్రోగ్రాం కం ఎక్స్‌ప్రైజర్ మెంటార్ మెంటీ స్కీం –2024ను నిర్వహించనున్నట్లు సమన్వయకర్త ప్రొఫెసర్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరంలోని పలు ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు పాల్గొంటాయని ఆయన పేర్కొన్నారు.

పోలీస్ ఫుడ్ కోర్ట్ ప్రారంభం



పోలీస్ ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: పోలీస్ సంక్షేమంలో భాగంగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సోమవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఫుడ్ కోర్ట్‌ను ప్రారంభించారు. విధి నిర్వహణలో ఉండి ఇంటికి వెళ్లి భోజనం చేయడానికి సమయం లేని పోలీసుల సౌకర్యార్థం ఈ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ నాణ్యమైన భోజనం, టిఫిన్‌ను తక్కువ రేటుకి అందిస్తారన్నారు. ఎలాంటి లాభాలకు తావు లేకుండా పోలీసులకు అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

బ్రిడ్జ్ కోర్సు ప్రారంభం


ప్రసంగిస్తున్న వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో సంస్కృత భాష, శాస్త్రాలపై పీజీలో నూతన అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్సును సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ వీసీ జీఎస్ఆర్.కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వర్సిటీలో బోధిస్తున్న 15 రకాల శాస్త్రాలపై నూతన విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు బ్రిడ్జ్ కోర్సును ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. విద్యార్థి దశ కీలకమని, లక్ష్యాన్ని ఉన్నతంగా నిర్దేశించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా, బ్రిడ్జ్ కోర్సు కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ రంగనాథన్, డాక్టర్ యశస్వీ, వంద మందికి పైగా పలు పీజీ కోర్సులలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు పాల్గొన్నారు.

175 మందికి కౌన్సెలింగ్

తిరుపతి క్రైమ్: జిల్లాలో రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న 175 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పోలీస్ పీఆర్‌ఓ విభాగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. జూలై మొదటి వారంలో జిల్లాలోని వివిధ సమస్యల గణాంకాలను ఈ సందర్భంగా ఆ విభాగం విడుదల చేసింది. ఇందులో అక్రమంగా తరలిస్తున్న 26 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, 2009 మంది రౌడీషీటర్ల కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపింది. బహిరంగంగా మద్యం సేవించే వారిపై 939 కేసులు నమోదు చేసి, 947 మందికి కోర్టులో జరిమానాలు విధించినట్టు వెల్లడించింది. 49 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు, ఫుట్‌పాత్ ఆక్రమించిన చిరు వ్యాపారాలపై 40 కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్టు పేర్కొంది.

ప్రజా పరిష్కార వేదికకు 72 ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 72 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నట్టు వెల్లడించారు. వీటిని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

వెంకటగిరి : వైఎస్సార్ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



శ్రీకాళహస్తి: వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



చంద్రగిరి : జోహార్ వైఎస్సార్ అంటూ నినదిస్తున్న తుడా మాజీ చైర్మన్ మోహిత్‌రెడ్డి



గుండె నిండా నువ్వే!

జిల్లాలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం చిన్నాపెద్దా తేడాలేకుండా.. ఊరూవాడా ఏకమై పండుగ చేసుకున్నారు. వైఎస్సార్ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఆత్మీయంగా నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేస్తూ.. పేదలకు అన్నదానం చేస్తూ.. సేవా కార్యక్రమాలు మిన్నంటించారు. రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

- ఊరూవాడా వైఎస్సార్ జయంతి వేడుకలు
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- కేక్‌లు కట్ చేసిన పార్టీ శ్రేణులు
- కూటమి నేతల ప్రోత్సాహంతో అక్కడక్కడా అడ్డు తగిలిన పోలీసులు


తిరుపతి: వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీషా

తిరుపతి అర్బన్: ఏళ్లు గడిచినా ఇప్పటికీ ఊరంతా నీ జ్ఞాపకాలే రాజన్నా.. పొలానికెళ్లినా.. పట్టణానికి వచ్చినా నీ ప్రతిరూపాలే.. నీ పథకాలు పదిలం.. నిను మేము మరువలేం! జోహార్ వైఎస్సార్.. జోహార్ వైఎస్సార్! అంటూ అభిమానులు చెమర్చిన కళ్లతో తమ అభిమాన నేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సోమవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి, కేక్‌లు కట్‌చేసి పండగ చేసుకున్నారు. కొందరు వైఎస్సార్ చిత్రపటం వద్ద కొత్త బట్టలు పెట్టి పూజలు నిర్వహించారు.

- తిరుపతి నియోజకవర్గంలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వైఎస్సార్ డీబీఆర్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరాభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. ఆయనతోపాటు మేయర్ డాక్టర్ శిరీషా పాల్గొన్నారు. తిరుపతి ఆర్టీఓ సర్కిల్ వద్ద రాయలసీమ యువజన నేత హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఇదిలావుండగా వెటర్నరీ యూనివర్సిటీని వైఎస్సార్ మానస పుత్రికగా పిలుస్తుంటారు. అయితే ఈ ఏడాది పోలీసులు అడ్డుచెప్పడంతో అభిమానులు నిరాశపడ్డారు.

- చంద్రగిరిలో ఆ నియోజకవర్గ సమన్వయకర్త, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుపతి రూరల్‌లోని లింగేశ్వర్ నగర్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఆర్సీ పురం మండలంలోని నెన్నూరులో వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం, పూలాభిషేకం చేశారు. చంద్రగిరి, పాకాల మండల కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేశారు. నియోజకవర్గంలో వైఎస్సార్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేసుకున్నారు.

- సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. సత్యవేడుతోపాటు బుచ్చినాయుడుకండ్రిగ, నాగలాపురం, వరదయ్యపాళెం మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని కేక్‌లు కట్ చేశారు. సత్యవేడులో వైఎస్సార్ ఏర్పాటు చేసిన శ్రీసిటీని గుర్తుచేసుకున్నారు. ఇక్కడ 300లకు పైగా పరిశ్రమలు, 30వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారని ఆయన గుర్తుచేశారు.

- వెంకటగిరి నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ జయంతి వేడుకలు చేపట్టారు. ముందుగా వెంకటగిరిలోని తమ బంగ్లా వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు. డక్కిలి, బాలయపల్లి, సైదాపురం, కలువాయి మండలాల్లోనూ ఆయా మండలాల నేతల ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహించారు.

- సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరులో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నేతృత్వంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఆయన నాయుడుపేటలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

- గూడూరు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీకృష్ణ వైఎస్సార్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ట్రాఫిక్ సమస్యను సాకుగా చూపించి గూడూరు పట్టణంలోని బనిగే సాహెబ్‌పేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కటింగ్‌కు పోలీసులు ఆంక్షలు విధించారు.

- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో పట్టణంలోని సినిమా వీధిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. వైఎస్సార్ పాలనలో మన్నవరం ప్రాజెక్టుతోపాటు సోమశిల–స్వర్ణముఖి కాలువ ఏర్పాటు ఎంతో తోడ్పాటునిస్తోందని గుర్తుచేశారు. శ్రీకాళహస్తి మండలంలో శ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో ఉత్సవాలు చేపట్టారు. ఏర్పేడు, తొట్టంబేడు, రేణిగుంట మండలాల్లోనూ అభిమానులు వైఎస్సార్ జయంతి వేడుకలు జరుపుకున్నారు.

పోరాటాలకు ఓటమి ఉండదు!

తిరుపతి మంగళం : ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయి ఉండవచ్చు.. అయినా తాము ఓడిపోయామని వంగేదేలా, తగ్గేదేలేదని తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని తిరుపతి డీబీఆర్ రోడ్డులోని వైఎస్సార్ మార్గం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూల మాల వేసి ఘన నివాళి అర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు మిన్నంటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదప్రజల ఆశాజ్యోతి మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అని, తన రాజకీయ జీవితంలో ఏ ఒక్కరికీ కూడా వెరవకుండా ప్రజలకు సేవ చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా పేదప్రజల గుండెల్లో చిరస్థాయిగా జీవించే ఉన్నారన్నారు. ఈ రోజు వైఎస్సార్‌సీపీ ఓడిపోయిందని కూటమి నేతలు చేస్తున్న దౌర్జన్యాలు, విధ్వంసాలను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు ఎన్ని దౌర్జన్యాలు చేయించినా తమ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలబడుతామన్నారు. దాంతో పాటు ప్రజల పక్షాన నిలబడి చంద్రబాబు చేసే ఆకృత్యాలను ఎదిరిస్తామని స్పష్టం చేశారు. చంద్రబాబు ఆకృత్యాలను ఎండగట్టి ఎదిరించడానికి వైఎస్సార్ జయంతి రోజున రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులంతా ప్రతిజ్ఞ చేసి ఉద్యమించేందుకు సిద్ధమయ్యారని గుర్తుచేశారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులపైన దౌర్జన్యాలు ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ శిరీషా, కార్పొరేటర్లు శేఖర్‌రెడ్డి, రామస్వామి వెంకటేశ్వర్లు, తమ్ముడు గణేష్, కోటూరు ఆంజినేయులు, ఆదం రాధాకృష్ణారెడ్డి, కోటేశ్వరమ్మ, బోకం అనిల్, పార్టీ నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, బొమ్మగుంట రవి, దేవదానం, వెంకటరెడ్డి, కట్టా గోపీయాదవ్, నల్లాని బాబుతో పాటు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి వైఎస్సార్

తిరుపతి మంగళం : రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడికీ సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలను అందించి పేదల ఆశాజ్యోతిగా చరిత్రలో నిలిచిపోన నాయకుడు, మహోన్నత వ్యక్తి మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కొనియాడారు. తిరుపతి మారుతీనగర్‌లోని పెద్దిరెడ్డి నివాసం వద్ద వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పుష్పాలతో నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. వైఎస్.రాజశేఖరరెడ్డి పాలనలో అందించిన సంక్షేమ పథకాలు దేశ రాజకీయాలకే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రతి పేదవాడి జీవితంలో వెలుగులు నింపారుకనుకే ఇప్పటికీ రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌ని వారి గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు విరుపాక్షి జయచంద్రారెడ్డి, విద్యార్థి విభాగం నాయకులు హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


గూడూరు : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్


సత్యవేడు : అన్నదానం చేస్తున్న సమన్వయకర్త నూకతోటి రాజేష్


నాయుడుపేట : వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

ప్రజా సంక్షేమ సారథి వైఎస్సార్

తిరుపతి కల్చరల్: ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసి బడుగు, బలహీనవర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన సంక్షేమ సారథి, మహానేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కొనియాడారు. ఎమ్మెల్సీ కార్యాలయంలో వైఎ స్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు.


వైఎస్సార్ చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామివారికి సోమవారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూది తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇసుక


ఇసుక్ స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

నాగలాపురం: మండలంలోని సుబ్బనాయుడుకండ్రిగ ఇసుక స్టాక్ పాయింట్‌ను సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇక మీదట ఇసుక కావలసిన వారు వారి ఆధార్ కార్డుతో ఆన్‌లైన్ ద్వారా బిల్లులు చెల్లించి ఇసుక పొందాల్సి ఉంటుందన్నారు. రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక తరలింపు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లారీ, ట్రాక్టర్ యాజమానులతో సమావేశమయ్యారు. సుబ్బనాయుడుకండ్రిగ ఇసుక్ స్టాక్ పాయింట్ తమిళనాడు రాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి సమీపంలో ఉందని, దీన్ని అదునుగా తీసుకుని పక్క రాష్ట్రాలకు ఇసుక తరలించరాదని హెచ్చరించారు. ఒక వేళ అలా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల మేరకే ఇసుక తరలించాలని సూచించారు. కార్యక్రమంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, శ్రీకాళహస్తి ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, స్థానిక తహసీల్దార్ డీ.నరసింహులు, ఎంపీడీఓ పీఎంకే బాబు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 23 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 78,912 మంది స్వామివారిని దర్శించుకోగా 32,039 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.83 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.


తిరుపతి బులియన్

క్లుప్తంగా

రేపటి నుంచి వైభవోత్సవాలు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీవారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. జూలై 10న పెద్ద శేష వాహనం, జూలై 11న హనుమంత వాహనం, జూలై 12న గరుడ వాహనంపై స్వామివారు రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

13న పార్వేట ఉత్సవం

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాల మరుసటి రోజైన జూలై 13వ తేదీన పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీవారిమెట్టు సమీపంలోని మండపంలో ఉదయం 7 నుంచి ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆస్థానం, పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

ఆర్జిత సేవలు రద్దు

11వ తేదీన తిరుప్పావడసేవ, జూలై 10 నుంచి 13వ తేదీ వరకు ఆర్జిత కల్యాణోత్సవం సేవను టీటీడీ రద్దు చేసింది. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్తు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అవినీతి లేదు గోవిందా!

- ఆ ఐదేళ్లు నిబంధనల మేరకే టీటీడీలో పాలన
- సీఎం చంద్రబాబుకు తేల్చిచెప్పిన విజిలెన్స్ బృందం
- నో నో.. ఏదో ఒకటి దొరికేవరకు తనిఖీలు, సోదాలు ఆపొద్దు
- విజిలెన్స్ బృందానికి మరోసారి సీఎం ఆదేశాలు
- తిరుమలలో పది రోజులుగా కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు
- అవినీతి, అక్రమాలు జరగనప్పుడు తామేం చెయ్యగలం అంటున్న విజిలెన్స్
- ధర్మారెడ్డి, భూమన, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్యంగా తనిఖీలు

'సర్.. ఆ ఐదేళ్లు టీటీడీలో పరిపాలనకు సంబంధించిన అన్ని రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించాం. నిబంధనల మేరకే పాలన జరిగినట్టు స్పష్టమవుతోంది. ఎక్కడా అవినీతి, అక్రమాలకు ఆస్కారమే లేదు. ఒకటికి రెండు సార్లు రికార్డులు పరిశీలించి చెబుతున్నాం.. అంటూ విజిలెన్స్ అధికారులు నెత్తీనోరు కొట్టుకుంటున్నా.. సీఎం చంద్రబాబు వినడం లేదు. నోనో..మీరు మరోసారి పరిశీలించండి..' అంటూ హుకుం జారీచేస్తున్నారు. దీంతో చేసేది లేక పది రోజులకుపైగా విజిలెన్స్ అధికారులు తిరుమలలోనే తిష్టవేసి సోదాల పైన సోదాలు నిర్వహిస్తూ తలలుపట్టుకోవడం ఇప్పుడు జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

సాక్షి, టాస్క్‌ఫోర్స్: టీటీడీని అడ్డుపెట్టుకుని కూటమి పెద్దలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లేందుకు కుట్రలు, కుతంత్రాలకు తెరలేపారు. గత ప్రభుత్వంలోని ముఖ్యులను లక్ష్యంగా చేసుకుని విజిలెన్స్ విచారణ చేపట్టారు. ఆ విచారణలో ఎంత వెదికినా టీటీడీలో అవినీతి అక్రమాలు జరిగినట్లు నిరూపించేందుకు ఎటువంటి ఆధారాలు దొరకలేదు. ఏదో ఒకటి దొరికే వరకు సోదాలు, తనిఖీలు ఆపొద్దని కూటమి ప్రభుత్వ పెద్దలు హుకుం జారీచేశారు.

శ్రీవాణిని తీసుకొచ్చేందే నాటి టీడీపీ పాలకమండలి

కూటమి ప్రభుత్వం చేపట్టిన విజిలెన్స్ తనిఖీల్లో శ్రీవాణి నిధుల విషయంపై ఆసక్తి కర విషయాలు వెలుగులోకి వచ్చాయి. శ్రీవాణి టికెట్ల పేరుతో ప్రత్యేక దర్శనాలు కల్పించాలనే ప్రతిపాదన తీసుకొచ్చింది నాటి టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన టీటీడీ పాలకమండలేనని బయటపడింది. 2019 ఎన్నికల ముందు ఉన్న టీటీడీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్ నేతృత్వంలోని పాలకమండలి శ్రీవాణి దర్శనంపై తీర్మానం చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. అయితే ఎన్నికలు రావడంతో ఆ తీర్మానం అమలుకు నోచుకోలేదు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నాటి టీటీడీ పాలకమండలి ఆ తీర్మానాన్ని అమలులోకి తీసుకొచ్చింది.



శ్రీవాణి నిధులు పక్కదారి పట్టే అవకాశమే లేదు

తిరుమలకు వచ్చే భక్తులు శ్రీవారిని దగ్గరగా దర్శనం చేసుకోవాలని కోరుకోవడం సహజం. అయితే అందరికీ సిఫారసు లేఖలు లభించే అవకాశం లేదు. అలాంటి వారిలో ఆర్థిక స్తోమత ఉన్నవారు రూ.10,500 చెల్లించి శ్రీవాణి టికెట్ తీసుకుంటే టీటీడీ బ్రేక్ దర్శనం కల్పిస్తుంది. ఈ నిధుల్లో రూ.10వేలు శ్రీవాణి ట్రస్ట్‌కి వెళ్తే, రూ.500 టికెట్ సొమ్ము టీటీడీకి చేరుతుంది. శ్రీవాణి ట్రస్ట్‌కి రూ.10వేలు చొప్పున చేరుతుంది. ఆ నిధులతో టీటీడీ పలు రాష్ట్రాల్లో 3,500కు పైగా ఆలయాలను నిర్మించిన విషయం విచారణలో వెలుగుచూసినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో శ్రీవాణి టికెట్లు ఆఫ్‌లైన్‌లో మొదట్లో వెయ్యి ఇచ్చేవారు. ఈ టికెట్ల కారణంగా సాధారణ భక్తులు ఇబ్బందులు పడకూడదని శ్రీవాణి టికెట్లను సగానికి తగ్గించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో శ్రీవాణి టికెట్లు గతం కంటే ఎక్కువగా ఇస్తున్నారు. రోజుకి 1,100పైగా విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉంటే.. హిందూపురం ఎమ్మెల్యే, చంద్రబాబు బావమరిది నందమూరి బాలకృష్ణ తన నియోజకవర్గంలో ఆలయాల నిర్మాణానికి శ్రీవాణి నిధులు ఇవ్వాలని టీటీడీకి లేఖలు పంపినినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో శ్రీవాణి టికెట్లను ఇష్టానుసారం అమ్ముకున్నారని, ఆ నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు విజిలెన్స్ విచారణలో వాస్తవాలు వెలుగుచూస్తుండడంతో ఏం మాట్లాడాలో అర్థంగాక తలలు పట్టుకుంటున్నారు. ఎలాగోలా గత ప్రభుత్వంలోని ముఖ్యులను ఇరికించేందుకు ఏదో ఒకటి చేయమని అధికారులపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు చేస్తుండడం గమనార్హం.

తానా అంటే..తందానా అంటారు!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీలో అవకతవకలు జరిగాయని సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలకు బలం చేకూరుస్తూ ఎల్లో మీడియా విషం కక్కుతున్న విషయం తెలిసిందే. చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఆయన మొదట శ్రీవారి దర్శనానికి విచ్చేశారు. అనంతరం తిరుమలలోనే విలేకరులు సమావేశం ఏర్పాటు చేసి గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. తిరుమల నుంచే ప్రక్షాళన మొదలుపెడతామని ప్రగల్భాలు పలికారు. ఆ వెంటనే టీటీడీ విజిలెన్స్ అధికారులను రంగంలోకి దింపారు. రెండు, మూడు రోజుల పాటు తనిఖీలు నిర్వహించారు. అయితే విజిలెన్స్ అధికారులు గత ప్రభుత్వంలో ఎటువంటి అవినీతి అక్రమాలు జరగలేదని తేల్చారు. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు టీటీడీ విజిలెన్స్ అధికారులపై నమ్మకం లేక.. రాష్ట్ర, జిల్లా స్థాయిలోని 40 మంది విజిలెన్స్ అధికారులను రంగంలోకి దింపారు. వారు బృందాలుగా విడిపోయి రోజుల తరబడి విస్తృతంగా సోదాలు నిర్వహించారు. అయినా కూటమి ప్రభుత్వ పెద్దలు ఆశించిన విధంగా అవకతవకలు బయటపడలేదు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుకు స్పష్టం చేసినట్లు సమాచారం.

నోనో..తనిఖీలు ఆపొద్దు

విజిలెన్స్ అధికారులు చెప్పిన సమాధానంతో షాక్ అయిన ప్రభుత్వ పెద్దలు జీర్ణించుకోలేకపోయారు. ఎలాగైనా ధర్మారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆర్కే రోజాను ఇరికించేందుకు తగిన ఆధారాలు దొరికే వరకు సోదాలు ఆపొద్దని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. దీంతో మరోసారి దర్శనాలు, సివిల్ వర్క్‌లపై తనిఖీలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ పెద్దలను ఇరికించేందుకు వారు ఎటువంటి అవకతవకలకు పాల్పడనప్పుడు ఎలా? అని విజిలెన్స్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. చంద్రబాబు చెప్పిందానికి తిరుమలలో జరుగుతున్న దానికి పొంతనలేదని చర్చించుకుంటున్నారు. సామాన్యభక్తులకు దర్శనభాగ్యం కల్పించకుండా శ్రీవాణి పేరుతో ఇష్టానుసారం టికెట్లు అమ్ముకున్నారని కూటమి నేతలు ఎన్నికల ముందు నుంచి ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. శ్రీవాణి ద్వారా వచ్చే నిధులంతా పక్కదారి పట్టాయని రాష్ట్ర ముఖ్య నాయకుల నుంచి గల్లీ లీడర్ల వరకు ఎవరి స్థాయిలో వారు విమర్శలు చేశారు. వారి విమర్శలను ఆధారంగా చేసుకుని ఎల్లో మీడియా అసత్య కథనాలను వండివార్చింది.

లోయలో పడ్డ లారీ

చంద్రగిరి: భాకరాపేట కనుమలో లారీ బోల్తా పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక నుంచి 14 టైర్ల భారీ ర్యాలీ తమిళనాడులోని గుమ్మిడిపూండికు బయల్దేరింది. సోమవారం తెల్లవారుజామున భాకరాపేట కనుమలోని పెద్ద మలుపు వద్ద లారీ ఒక్కసారిగా అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవరు జహీర్ బాషా క్షేమంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


లోయలోకి దూసుకెళ్లిన లారీ

17న ప్రజాప్రతినిధుల సన్మాన సభ

తిరుపతి కల్చరల్: రాష్ట్ర కురుబ, కురుమ, కురువ సంఘం, షెఫర్డ్స్ ఇండియా ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన ఉదయం 10 గంటలకు తిరుచానూరు రోడ్డులోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో చేపట్టే దేశవ్యాప్తంగా ఎంపికైన ప్రజాప్రతినిధుల సన్మాన సభను జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన సన్మాన సభ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ సన్మాన సభలో సుమారు 25 మందిని సత్కరించనున్నట్టు వెల్లడించారు. ఏపీ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డి కుమార్, జిల్లా అధ్యక్షుడు మంగిరి రెడ్డెప్ప, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీనివాసులు, రామాంజయులు, సుబ్బయ్య, పోతయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న కురుబ కుల సంఘ ప్రతినిధులు

ఆంక్షలతో అడ్డుకోలేరు

చిల్లకూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను నిర్వహించుకునేందుకు బనిగేసాహెబ్‌పేటలోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కటింగ్ ఏర్పాటు చేసుకుంటే అధికార పార్టీ నాయకులు పోలీసుల ద్వారా ఆంక్షలు విధించడం శోచనీయమని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ధ్వజమెత్తారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ విగ్రహం వద్ద వెనుక భాగంలో కార్యక్రమం ఏర్పాటు చేసుకుంటామని చెప్పినప్పటికీ పోలీసులు సహకరించలేదన్నారు. అధికారం చేపట్టిన వెంటనే టీడీపీ నాయకులు ఇష్టానుసారంగా అక్రమ వ్యాపారాలకు తెరలేపారని, ఇవన్నీ తెలిసినా గూడూరు ఆర్డీఓ మిన్నకుండిపోవడం బాధాకరమని వాపోయారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎక్కడైనా మట్టి, గ్రావెల్, తెల్లరాయి, సిలికా అక్రమంగా తవ్వుతున్నారని తెలిస్తే చాలు.. వెంటనే విలేకరులను వెంటబెట్టుకుని అక్కడ వాలిపోయేవారని, అయితే నేడు గూడూరు మండలం, పోటుపాళెం చెరువులో గత వారం రోజుల నుంచి మట్టి అక్రమంగా తరలిస్తుంటే స్వయంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. మట్టి, గ్రావెల్ తరలించి వ్యాపారాలు చేసుకునేందుకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నును చెల్లించి తర్వాత వ్యాపారాలు చేసుకోవాలని ఆయన సూచించారు.


కేక్ కట్ చేసి నాయకులకు తినిపిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

మమ్మల్ని విధుల్లోకి తీసుకోండి


మాట్లాడుతున్న ఆర్టీసీ కార్మికుడు పీవీ.రెడ్డి

తిరుపతి కల్చరల్: తమను విధుల్లోకి తీసుకొని ఆదుకోవాలని ఆర్టీసీ కార్మికులు పీవీ.రెడ్డి, కె.ధనంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి హైదరాబాద్ తార్నాక హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు నిర్వహించి, అక్కడి వైద్య అధికారులు ఆర్టీసీ విధి నిర్వహణకు తాము పనికిరామని సిఫార్సు లేఖలు రాశారని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్‌గా కాకుండా వివిధ కేటగిరిలకు సంబంధించిన ఉద్యోగ బాధ్యతలు కల్పించాలని సుమారు 8 ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా వినిపించుకోలేదన్నారు. ఫలితంగా తమ కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం దాపురించిందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 50 మంది, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9,010 మంది ఆర్టీసీ కార్మికులు ఇదే సమస్యతో విధుల్లే లేక, కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించి పరిష్కరించి ఆదుకోవాలని కోరారు. బాధిత ఆర్టీసీ కార్మికులు కె.గంగయ్య, అరుణ, ముబారక్ పాల్గొన్నారు.

ప్రాధాన్య క్రమంలో అర్జీల పరిష్కారం

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను ముందుగా టోకెన్ ఇస్తామని.. ఆ ప్రకారమే పరిశీలన ఉంటుందని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తోపాటు డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్రరెడ్డి, కోదండరామిరెడ్డి గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా వచ్చిన అర్జీనే ముందుగా పరిశీలించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీకి సంబంధించి ఆయా విభాగానికి చెందిన అధికారితో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారం చూపడం జరుగుతుందని వివరించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా 115 అర్జీలు వచ్చాయని, ఇందులో ఒక్క రెవెన్యూ శాఖకు సంబంధించినవే 57 అర్జీలు ఉన్నాయని ఆయన వివరించారు.


కలెక్టరేట్‌లో అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్


ఆర్డీఓ కార్యాలయంలో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

రక్షణ కల్పించండి

- రుయాలో నర్సుల ఆందోళన

తిరుపతి తుడా: విధుల్లో ఉన్న తమకు రక్షణ కల్పించాలంటూ తిరుపతి రుయా ఆస్పత్రి నర్సింగ్ స్టాఫ్ ఆందోళనకు దిగింది. ఈ మేరకు సోమవారం ఉదయం పరిపాలనా భవనం వద్ద నిరసన చేపట్టారు. ఏపీ ఎన్జీవో, ఏపీ హంస నాయకులు మద్దతు పలికారు. నిరసన అనంతరం రుయా సూపరింటెండెంటు డాక్టర్ ఆర్.రవిప్రభుకు వినతి పత్రాన్ని అందించారు. దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపై విధుల్లో ఉన్న నర్సింగ్ స్టాఫ్ పై ఎలాంటి దాడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వార్డుల్లో తమకు భద్రత కావాలని డిమాండ్ చేశారు. అయితే రోగి తన మానసిక పరిస్థితి సరిగా లేక దాడి చేశారని, నర్సుపై కావాలనే చేసిన దాడి కాదని వైద్యులు నిర్ధారించారు. దీంతో బాధితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రత్యేకంగా అతన్ని ఓ బెడ్ పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. నర్సింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రతినిధులు, స్టాఫ్ నర్సులు నిరసనలో పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న నర్సింగ్ స్టాఫ్

నర్సు యశోద కోలుకునే వరకు జీతంతో కూడిన సెలవు

రోగి దాడిలో గాయపడ్డ రుయా నర్సు యశోద కోలుకునే వరకు జీతంతో కూడిన సెలవును మంజూరు చేశారు. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా ఈ మేరకు యశోదకు జీతంతో కూడిన సెలవు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని రుయా అధికారులతో పాటు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి సత్యకుమార్ రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభుతో యశోద ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. నర్సు కోలుకునే వరకు జీతంతో కూడిన సెలవు మంజూరు చేయాలని మంత్రి సూచించారు

రైలు కిందపడి వృద్ధురాలి మృతి

చంద్రగిరి: రైలు కిందపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నరసింగాపురం రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం, కుమ్మరిపల్లికి చెందిన ఆదెమ్మ(75)ను సోమవారం మధ్యాహ్నం నరసింగాపురం రైల్వే స్టేషన్ సమీపంలో శ్రీనివాసమంగాపురం రైల్వే గేటు వద్ద రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆదెమ్మ తల, మొండెం వేరు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

పెన్షనర్స్‌కి ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయండి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పీపీఎస్ఎస్ఎన్‌పీ.శాస్త్రి

తిరుపతి కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీపీఎస్ఎస్ఎన్‌పీ.శాస్త్రి డిమాండ్ చేశారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సోమవారం ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి వాటి పరిష్కారానికి రాష్ట్ర కమిటీ కృషి చేస్తుందన్నారు. రావాల్సిన బకాయిల విషయంలో సంఘం పోరాడుతుందని తెలిపారు. ఈహెచ్‌ఎస్ కార్డుపై అన్ని వ్యాధులకు వైద్య సౌకర్యంతోపాటు మెడికల్ క్లెయిమ్‌లు రెండు లక్షల నుంచి ఐదు లక్షల వరకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.లక్ష్మీనారాయణ, కోశాధికారి పీ.నాగరాజు, అసోసియేట్ అధ్యక్షులు ఆర్.రామ్మూర్తి, హనుమంతరావు, గురురాజారావు, జయరామానాయుడు, జిల్లా అధ్యక్షుడు కేఆర్.శంకర్, కోశాధికారి సిద్ధయ్య, నగర కార్యదర్శి వెంకటేశంశెట్టి, కోశాధికారి మునికృష్ణయ్య, సహాయ కార్యదర్శులు రమణప్ప, టీ.రమణ, జయలక్ష్మి, నవనీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న కుక్కే సుబ్రహ్మణ్య పీఠాధిపతి

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య మఠం పీఠాధిపతి విద్యాప్రసన్న తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. తిరుమల బేడి ఆంజనేయ స్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.


పీఠాధిపతి స్వాగతం పలుకుతున్న జేఈఓ

ఎంబీయూలో ఆన్‌లైన్ శిక్షణ

చంద్రగిరి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మోహన్ బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) సంయుక్తంగా సోమవారం ఎంబీయూలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై అధ్యాపకులకు ఆన్‌లైన్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ (టెక్నికల్) డాక్టర్ రవి మాట్లాడుతూ క్లౌడ్ కంప్యూటింగ్ విశిష్టతను, అమెజాన్ వెబ్ సర్వీసెస్ వివిధ అంశాలు వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను క్లౌడ్ కంప్యూటింగ్ మీద పొందుపరిచామని పేర్కొన్నారు. రీసోర్స్‌పర్సన్‌గా చీలి రామకృష్ణ, గోపిరాజు వ్యవహరించారు.